క్లుప్తంగా

వందశాతం పన్నులు వసూలు చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో గృహ, వ్యాణిజ్య, వాపారుల నుంచి పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్, వాటర్ సప్లై, ఇంటి పన్నుల వసూల్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు పన్నుల వసూల్‌కు సహకరించాలని , పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, మేనేజర్ భూపాల్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువు పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న ఎంపీపీ, నాయకులు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల గ్రామ పెద్ద చెరువుతో పాటు మిడ్‌మానేరు ప్రాజెక్టు ప్రధాన కాల్వ, ఉపకాల్వ–8ను ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటీ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడి కాల్వకు అనుసంధానంగా నిర్మించిన ఉపకాల్వ 8 ద్వారా పెద్ద చెరువులోకి నీటిని తరలించడానికి చెరువును పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఉపకాల్వ–8కు ప్రత్యేక ఓటీ(తూము)ను ఏర్పాటు చేయడంతో పాటు కాల్వ నిర్మాణం చేపడితే చెరువులోకి నీటి తరలింపు సాధ్యమవుతోందన్నారు. సమస్యను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు నీటి పారుదలశాఖ అధికారులు చెరువును బుధవారం సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సంగు దేవయ్య, సహకార సంఘం డైరెక్టర్ బద్దం రాంరెడ్డి, నాయకులు దుడ్డు మల్లేశం, రామంచ స్వామి, లింగంపల్లి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

వొడితెల ప్రణవ్‌ను కలిసిన దళితబంధు లబ్ధిదారులు


ప్రణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

హుజూరాబాద్: దళితబంధు లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబును పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.రెండో విడతలో అకౌంట్‌లోకి డబ్బులు వచ్చాయని, యూనిట్ పెట్టుకున్న లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు డబ్బులు చెల్లించడం లేదని, అకౌంట్‌లో మాత్రం డబ్బులు ఉన్నట్లు చూపిస్తున్నాయని తెలిపారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరగా రెండో విడుత దళితబంధు డబ్బులు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. సమస్యను సీఎం, ఉపముఖ్యమంత్రి, మంత్రుల దృష్టి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాజేశ్, సురేశ్, నరేశ్, రామంచ రాకేశ్, రాజు, నారాయణ, భరత్, నాగరాజు, నరేశ్, శ్రవణ్, ఉదయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జీపీ పారిశుధ్య కార్మికుడు కొండి రాజయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరకులు సోమవారం అందజేసింది. కుటుంబ పరిస్థితిని గంగాధర మండల కేంద్రానికి చెందిన మహాలక్ష్మి సూపర్ మార్కెట్ యాజమాని శ్రీరామ్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లగ 25 కిలోల బియ్యం, ఇతర వస్తువులు అందజేశారు. స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు కనకయ్య, కార్యదర్శి రవిశాస్త్రి, గౌరవాధ్యక్షుడుహన్మంతరెడ్డి, మల్లేశం, సాయి కుమార్, సిద్దు, సంపత్, మల్లేశం పాల్గొన్నారు.

రైలు ఢీకొని హమాలీకి గాయం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం గూడ్స్ రైలు ఢీకొట్టడంతో హమాలీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రేకుర్తికి చెందిన రాజు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 11గంటలకు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. రాజు ఎడమ కాలు అక్కడికక్కడే తెగిపోయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి వచ్చి గాయపడిన రాజుకు ప్రథమచికిత్స చేసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రామగుండం రైల్వే పోలీసులు తెలిపారు.

మహనీయుల ముసుగు తొలిగేదెన్నడో?

- అనుమతి లేకుండా ఆర్టీసీ స్థలంలో విగ్రహాలు
- ఏడాది క్రితం రాత్రికి రాత్రే ఏర్పాటు
- ఆవిష్కరణను అడ్డుకున్న ఆర్టీసీ సిబ్బంది
- ఇప్పటికీ ముసుగు తొలగని వైనం..
- కాంగ్రెస్ హయాంలోనైనా తొలిగేనా?


పిచ్చి మొక్కల మధ్యలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు


సీపీ సత్యనారాయణ, ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి(ఫైల్)

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముసుగులు ఏడాదిగా తొలగడం లేదు. రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ విగ్రహాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేశారు. ఏడాది దాటినా అనుమతులు రాకపోగా విగ్రహాలు ఆవిష్కరణకు నోచుకోవడం లేదు.

ఎప్పటి నుంచో ఆలోచన..

తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని 2010 నుంచే ఆలోచన చేస్తున్నారు. నాటి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ విగ్రహాలు ఏర్పాటు చేయడానికి అంబేద్కర్ దళిత సంఘాలు యత్నించాయి. కాంగ్రెస్ హయాంలోనూ అప్పటి నాయకులు దళిత సంఘాల నాయకులు అప్పటి ఆర్టీసీ చైర్మన్ ఎం. సత్యనారాయణరావు, ఎండీ ఏకే ఖాన్‌ను కలిసి స్థల విషయంలో వినతిపత్రం సమర్పించగా అప్పుడు వారు సానుకూలంగా స్పందించారు. తర్వాత తెలంగాణ ఉద్యమ క్రమంలో అంశాన్ని ఎవరు పట్టించుకోలేదు. తర్వాత ప్రక్రియ నిలిచిపోయింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన రసమయి బాలకిషన్ హయాంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఆర్టీసీ అనుమతి ఇవ్వకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది.

రాత్రికి రాత్రే ఏర్పాటు..

ఈ క్రమంలో గతేడాది ఏప్రిల్‌లో రాత్రికి రాత్రే విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. దీంతో ఆర్టీసీ అధికారులు సదరు అంబేడ్కర్ సంఘం నాయకులపై కేసులు నమోదు చేశారు. తర్వాత విషయంపై రసమయి ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఎండీ దృష్టికి సైతం తీసుకెళ్లారు. కానీ అక్కడ హామీ లభించకపోవడంతో ఆ ప్రతిష్ఠాపన నిలిచిపోయింది. అధికార పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి విగ్రహాలను ఆవిష్కరించకపోవడంతో రసమయిపై విమర్శలు వచ్చాయి.

నిత్యం బందోబస్తు..

విగ్రహాలను ఆవిష్కరించకుండా ఏడాదిన్నరగా పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది కాపలా కాస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతోపాటు సానుకూలంగా స్పందించింది. తర్వాత ప్రభుత్వం మారింది. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మానకొండూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ విజయం సాధించడంతో విగ్రహాల ఆవిష్కరణపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈమేరకు దళితసంఘాలు కూడా ప్రయత్నాలు ప్రారంభించాయి. ఎమ్మెల్యే చొరవతో ఆర్టీసీ నుంచి అనుమతి తీసుకొని విగ్రహాలు ఆవిష్కరించాలని కోరుతున్నారు.

అంబరాన్నంటిన సంబురాలు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. గ్రామ శివారుల్లోని చెరువుల వద్ద రైతులు పశువులకు పూజలు చేశారు. కాటిరేకుల పండుగ నిర్వహించారు. మహిళలు ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి పండుగను స్వాగతించారు. ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంట్లో పిండి వంటకాలను ఆరగిస్తూ చిన్న, పెద్ద తేడా లేకుండా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అందంగా అలంకరించి ఆలయా చుట్టూ మేళ తాళాలతో ఊరేగించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. చొప్పదండి పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో పంచ కళ్యాణాలను సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



శంకరపట్నం: విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు, రామడుగు: వెలిచాలలో..


హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి ఇందిరానగర్‌లో..


చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో...


గన్నేరువరం: ఖాసింపేటలో...


తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో పెద్ద ముగ్గు


హుజూరాబాద్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా పూజలు చేస్తున్న వొడితెల ప్రణవ్


మానకొండూర్: గోపూజ చేస్తున్న భక్తులు


రామడుగు: పూజలు చేస్తున్న సర్పంచ్ సరోజన

నూతన కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ పరిధి కిష్టంపల్లి గ్రామ మున్నూరుకాపు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్ట సతీశ్, ఉపాధ్యక్షుడిగా మిట్ట మధు, ప్రధాన కార్యదర్శిగా తోట సంతోశ్, కోశాధికారిగా కోల హరీశ్, సంయుక్త కా ర్యదర్శిగా చింతపంటి సాగర్, సలహాదారుడిగా తోట శ్రీనివాస్ ఎన్నికయ్యారు. యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం (కరీంనగర్ సర్క్యూట్ హౌస్)లో అక్రమంగా 18 మందిని నియమించిన నగర పాలక సంస్థ అధికారులపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్‌సింగ్ కమల్‌జిత్‌కౌర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పురపాలక పరిపాలన అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ ద్వారా జీతాలు ఇస్తున్నారని తెలిపారు. దీనికోసం వీరి నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. నియామకాలు నిబంధనలకు విరుద్ధమన్నారు. సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సతీశ్, అధ్యాపకులు

హుజూరాబాద్‌రూరల్: మానవ జీవితానికి పుస్తక పఠనం దిక్సూచి అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల సెక్రెటరి వొడితెల సతీశ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడు డాక్టర్ వీరనాయక్ రచించిన టీచింగ్ రీడింగ్ స్కిల్స్ త్రు కల్చరల్ నరేటివ్స్ అనే పుస్తక ఆవిష్కరణ సభ కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త పుస్తకాలలో విషయ పరిజ్ఞానం ఉంటుందని, ప్రస్తుతం సమాజానికి పరిశ్రమలకు అవసరమైన విజ్ఞానం పుస్తకంలో ఉండటం వల్ల అధ్యాపకులు నేర్చుకొని విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళా శాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితెల ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, హుమానిటీస్ అండ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఇల్లందకుంట: కేంద్ర ప్రభుత్వం, మోదీ అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నకోమటిపల్లి , ఇల్లందకుంట గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు.

సైదాపూర్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు, నాయకులు ప్రచారం చేశారు.

బీఎస్పీతోనే బహుజనుల రాజ్యాధికారం

గన్నేరువరం: బహుజనుల రాజ్యాధికారం బీఎస్పీ అధినేత్రి మాయావతితోనే సాధ్యమవుతోందని పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషాని రామచంద్రం అన్నారు. మండల కేంద్రంలో మాయావతి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక లో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా జరిపారు. అనంతరం జెండా ఆవిష్కరించారు.

ప్రభుత్వ భూమిఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమించి, ఎంలాంటి పర్మిషన్ లేకుండా ఇండ్ల నిర్మాణం చేస్తున్నారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యుడు రవీచందర్‌రెడ్డి కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 688లో ప్రభుత్వ భూమి, రహదారులు ఆక్రమణ గురవుతున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చీమలకుంటపల్లిలో 'తొలిపొద్దు'

గన్నేరువరం: మండలంలోని చీమలకుంటపల్లెలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. గెలుపు ఓటమితో సంబంధం లేకుండా ప్రజల కోసం పని చేస్తానన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బామండ్ల తిరుపతి తల్లి రామవ్వ ఇటీవల మృతి చెందగా పరామర్శించారు. వెంట జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులున్నారు.

పరామర్శ

మానకొండూర్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్ పరామర్శించారు.

హుజూరాబాద్‌లో వొడితెల ప్రణవ్.

హుజూరాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు తల్లి సొల్లు సంతోషమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు పరామర్శించారు.

విద్యుత్ సామగ్రి చోరీ

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీ అంగారిక టౌన్ షిప్ వద్ద ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు కొద్ది రోజులుగా పనులు చేపడుతున్నారు. 240 కిలోల అల్యూమినీయం కండక్టర్‌ను ఈనెల 14న రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. 15న సెలవు కావడంతో ఎవరూ అటువైపు వెళ్లలేదు. మంగళవారం పనుల కోసం వచ్చిన విద్యుత్ సిబ్బంది పరిశీలించగా కండక్టర్ కనిపించలేదు.ఎల్ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజేశ్వర్‌రావు, సంపత్

జమ్మికుంట: పట్టణ పీఏసీఎస్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో మంగళవారం 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల భాగస్వామ్యంతో పీఏసీఎస్ బ్యాంక్ అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులకు సేవలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, కార్యనిర్వహణ అధికారి వొజ్జ రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడా వార్తలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


చొప్పదండి: అభినందిస్తున్న హెచ్‌ఎం రాజిరెడ్డి

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు కె. రాంచరణ్, శివాని ఆర్మూర్ పట్టణంలో ఈ నెల 17 నుంచి జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కె. కృష్ణ, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మమత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

రామడుగు: జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని వెలిచాల గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. క్రీడలతో మంచి స్నేహభావం పెరుగుతుందని, క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం విన్నర్‌కు రూ.పదివేలు చెక్కు, ట్రోఫీ, రన్నర్‌కు నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇరుజట్ల సభ్యులు, క్రీడాకారులు, పలువురు పాల్గొన్నారు.


ప్రోత్సాహకాలు అందుకుంటున్న క్రీడాకారులు

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్, పోరండ్ల గ్రామంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు నుస్తులాపూర్ సర్పంచ్, టోర్నీ నిర్వాహకుడు రావుల రమేశ్, పోరండ్ల నిర్వాహకుడు లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేశ్, అనిల్, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, సదానందరెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువకులకు వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, చందు దంపతులు రెండు రోజులు క్రికెట్ పోటీలను నిర్వహించి మెమోంటోలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. పదకొండేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నామని, మండలంలోని గుమ్లాపూర్‌లో గ్రామీణ, జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి టీషర్టులు అందించారు. మల్లన్నపల్లిలో ఏవైఎస్ ఆధ్వర్యంలో ముగ్గులు, వాలీబాల్ పోటీలను నిర్వహించగా విజేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందించారు.



రామడుగు: గెలుపొందిన జట్టుకు రూ. పదివేల చెక్కు అందిస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

ఆధ్యాత్మికం

అయ్యప్ప ఆలయంలో పడిపూజ


చొప్పదండి: మకరజ్యోతి వీక్షిస్తున్న భక్తులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో సోమవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. శబరిమల యాత్ర పూర్తి చేసిన భక్తుల జ్యోతి దర్శనం పురస్కరించుకొని కార్యక్రమం చేపట్టారు. అర్చకులు పాలోజు చరణాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అనంతరం లైవ్‌లో అయ్యప్ప మకర జ్యోతి దర్శనం ప్రదర్శించారు. ప్రత్యేక భజనలు చేశారు. అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవ విగ్రహ దాత పైడ మహేశ్ దంతపులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ గురుస్వాములు పాల్గొన్నారు.

అయ్యప్ప తిరు ఆభరణాలు ఊరేగింపు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి తిరు ఆభరణాలను పట్టణంలో మేళతాళాల మధ్య భక్తి, శ్రద్ధలతో అయ్యప్ప భక్తులు ఊరేగించారు. అనంతరం అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉత్సవ విగ్రహాలకు, మూలవిరాట్‌ను నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతిదర్శనం గావించారు. అయ్యప్పస్వాముల జ్యోతిదీక్ష పరిపూర్ణమైనట్లు గురుస్వాములు ప్రకటించారు. ఊరేగింపులో భక్తుల శరణుగోషతో వాడలు మారు మోగాయి, మహిళలు మంగళ హారతులతో తిరు ఆభరణాలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి దేవాలయం ఉత్సవ, అభివృద్ధి కమిటీ, గురుస్వాములు రవీందర్‌రెడ్డి, నటరాజ్, కుమార్, వెంకట్రావు, రాజు, సీహెచ్ యాదగిరి, సమ్మయ్య, నాగభూషణం, సీఎం రమేశ్, పూజారులు ఎస్. కిరణ్‌కుమారాచార్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


ఆభరణాల ఊరేగింపులో అయ్యప్పస్వాములు

ప్రత్యేక పూజలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీపాంబండ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, స్వయంభూ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం షష్టి తిథిని పురస్కరించుకుని శ్రీశ్రీ గురూజీ ఉమేశ్‌స్వామి పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందించారు. ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తోచిన విరాళం అందించారు. అనంతరం కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ రఘునాథ రెడ్డి, సదాచారి, ఆలయ ధర్మకర్తలు మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, గూడెం లక్ష్మి, అమర్, సునీల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి గ్రామంలో మంగళవారం ఇంటింటికీ అయోధ్య రాములోరి అక్షింతల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అజయ్‌రెడ్డి, ఉపసర్పంచ్ లింగయ్య, శ్రీరామ భక్తులు రవీందర్, మనోజ్‌రెడ్డి, మల్లయ్య,ఎల్లయ్య, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, కాంతారెడ్డి, రమేశ్, మహేందర్‌రెడ్డి, వీరయ్య, సంపత్‌రెడ్డి, రాజేశం, తిరుపతి, గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


అక్షింతల పంపిణీలో శ్రీరామభక్తులు


చిగురుమామిడి: ప్రత్యేక పూజల్లో భక్తులు

క్రైం కార్నర్

కేసు నమోదు

జమ్మికుంట: అజాగ్రత్తగా బైక్ నడుపుతూ ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మడిపల్లి గ్రామానికి చెందిన మంగ రాజయ్య, మల్లమ్మ బైక్‌పై వస్తుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం పెద్దకోమిటిపల్లి గ్రామానికి చెందిన దొంగల నరేశ్ అజాగ్రత్త బైక్ నడుపుకుంటూ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో బైకు పూర్తిగా ధ్వంసమైందని, బాధితుడి తమ్ముడు మంగ తిరుపతి ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో కరీంనగర్–వరంగల్ రహదారిపై మంగళవారం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. కొత్తగట్టు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఖలీషా విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై ఎంపీడీవో కార్యాలయానికి వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఖలీషాకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.